సోమవారం సుప్రీంకోర్టు ఎదుట 'రీ నీట్' ప్లకార్డును ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పరీక్ష పవిత్రత దెబ్బతింటే
రీ టెస్టుకు ఆదేశం

- నీట్-యూజీ లీకేజీ పిటిషన్లపై సుప్రీంకోర్టు వ్యాఖ్య
- ప్రశ్నాపత్రం లీకేజీ వాస్తవమే..అదెంత వరకు వెళ్లింది?
- పూర్తి వివరాలు ఇవ్వాలని కేంద్రం, ఎన్టీఏకు ఆదేశాలు
- దర్యాప్తుపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సీబీఐకి సూచన

న్యూఢిల్లీ, జూలై 8: దేశవ్యాప్తంగా దుమారం రేపిన నీట్ యూజీ-2024 లీకేజీ, పరీక్షలో అక్రమాల వ్యవహారంపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రశ్నాపత్రం లీకేజీ అయిన మాట వాస్తవమేనని స్పష్టం చేసిన సర్వోన్నత న్యాయస్థానం.. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నీట్ యూజీ రీ టెస్ట్‌కు ఆదేశాలు ఇచ్చే ముందు అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. రీ టెస్ట్‌ను చివరి అవకాశంగా పరిగణిస్తామని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడించింది. దానికి ముందు.. అసలు లీకైన పరీక్ష ప్రశ్నాపత్రం ఎంత వరకు వెళ్లింది? దాని వలన ఎంత మంది లబ్ధి పొందారు? అనే అంశాలను గుర్తించాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నది. పరీక్ష పవిత్రత దెబ్బతిన్నదని భావిస్తే, రీ టెస్ట్‌కు ఆదేశాలు ఇస్తామని స్పష్టం చేసింది. ప్రశ్నాపత్రం లీకేజీకి సంబంధించిన వివరాలను ఇవ్వాలని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ)లను ఆదేశించింది. పరీక్షలో అక్రమాలకు పాల్పడిన వారిని ఎంత మందిని గుర్తించారు? పేపర్ లీకేజీకి అక్రమార్కులు అనుసరించిన విధానం ఏంటి? అనే వివరాలు కూడా ఇవ్వాలని ఆదేశించింది. మొత్తం 38 పిటిషన్లపై విచారణ జరిపిన ధర్మాసనం.. తదుపరి విచారణను ఈ నెల 11కు వాయిదా వేసింది.

పరీక్ష మొత్తం సమగ్రత దెబ్బతిన్నదా?

నీట్ లీకేజీ, పరీక్షలో అక్రమాల ఆరోపణలపై చేస్తున్న దర్యాప్తు ఎంత వరకు వచ్చిందో నివేదిక ఇవ్వాలని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా సీబీఐని ఆదేశించింది. రీటెస్ట్‌కు ఆదేశాలు ఇవ్వడంపై స్పందిస్తూ 'అక్రమాల ఆరోపణలు ఒక వ్యవస్థాగత స్థాయిలో జరిగాయా? అనేది పరిశీలించాల్సి ఉంది. అదే విధంగా ఈ అక్రమాల వల్ల పరీక్ష మొత్తం సమగ్రత దెబ్బతిన్నదా? మోసం చేసి లబ్ధి పొందిన అభ్యర్థులను నిజాయితీ గల విద్యార్థుల నుంచి వేరు చేయవచ్చా? అనే అంశాలను కూడా చూడాలి' అని స్పష్టం చేసింది. అక్రమాలు మొత్తం పరీక్ష ప్రక్రియపై ప్రభావం చూపిన పరిస్థితుల్లో, అక్రమాలకు పాల్పడిన అభ్యర్థులను వేరు చేసే వీలుకాని పక్షంలో రీ టెస్ట్‌కు ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం ఉంటుందని అభిప్రాయపడింది.

ఎంత మంది ఫలితాలు నిలిపేశారు?

ప్రశ్నాపత్రం లీకేజీ నుంచి ఎంత మంది లబ్ధి పొందారు? వారిపై తీసుకొన్న చర్యలేంటో చెప్పాలని కేంద్రాన్ని ఆదేశించింది. 'అక్రమాలకు పాల్పడిన వారిలో ఎంత మంది ఫలితాలను నిలుపుదల చేశారు? అలాంటి వాళ్లు ప్రాంతాల వారీగా ఎంత మంది ఉన్నారు?' చెప్పాలని పేర్కొన్నది.

తప్పు చేసిన వారిని గుర్తించలేకపోతే..

టెలిగ్రామ్, వాట్సాప్, ఇతర ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా ప్రశ్నాపత్రం లీకేజీ జరిగితే, అది దావానలంలా వ్యాప్తి చెందినట్టు అని అభిప్రాయపడింది. 'పరీక్ష పవిత్రత కోల్పోతే, అప్పుడు రీటెస్టుకు ఆదేశాలు ఇస్తాం. తప్పు చేసిన వారిని మనం గుర్తించలేకపోతే, రీ టెస్ట్‌కు ఆదేశిస్తాం' అని న్యాయస్థానం ఈ సందర్భంగా పేర్కొన్నది.

కోరుకున్న ప్రాంతాల శాటిలైట్ చిత్రాలు!

త్వరలో సాధ్యం చేయనున్న బెంగళూరు స్టార్టప్



న్యూఢిల్లీ, జూలై 8: మీ ఇంటి పెరటి శాటిలైట్ చిత్రాలు కావాలా? లేక మీరు కోరుకొన్న ఏదైనా ఇతర ప్రాంతాల ఫొటోలు కావాలా? బెంగళూరుకు చెందిన స్పేస్ స్టార్టప్ 'పిక్సెల్స్' దీన్ని సాధ్యం చేయనున్నది. దీనికి సంబంధించి ఒక ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌ను త్వరలో అవిష్కరించేందుకు సిద్ధమైంది. దీని ద్వారా భూకక్ష్యలో ఇప్పటికే తిరుగుతున్న పిక్సెల్స్ సంస్థ ఉపగ్రహాలు తీసిన భూమి చిత్రాల డాటా బేస్ నుంచి తమకు అవసరమైన వాటిని యూజర్లు బ్రౌజ్ చేసుకోవచ్చు. ఒకవేళ అందుబాటులో లేకుంటే, అర్డర్ కూడా పెట్టుకొనే అవకాశం కూడా ఉంటుంది. పిక్సెల్స్ స్పేస్ సీఈవో, సహ వ్యవస్థాపకులు అవైస్ అహ్మద్ పీటీఐ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ అంతరిక్ష సంబంధిత డాటాను కొద్దిపాటి రుసుంతో సామాన్యుడికి అందుబాటులోకి తీసుకొచ్చేలా చేసిన ప్రయత్నమే తమ స్టార్టప్‌కు చెందిన భూ పరిశీలన స్టూడియో 'అరోరా' అని పేర్కొన్నారు. అరోరా మరి కొద్ది నెలల్లో అందుబాటులోకి వస్తుందని, పిక్సెల్స్ శాటిలైట్లు తీసిన భూమికి చెందిన హైపర్‌స్పెక్ట్రల్ చిత్రాలు, డాటా విశ్లేషణ అందరికీ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. గూగుల్ ఎర్త్‌ను ఉపయోగించినట్టుగానే ఈ సాఫ్ట్‌వేర్ వినియోగం కూడా సులభంగా ఉంటుందని తెలిపారు. భూమి చిత్రాలను తీసేందుకు ఉద్దేశించిన శాకుంతల, ఆనంద్ అనే రెండు ఉపగ్రహాలను పిక్సెల్స్ సంస్థ లాంచ్ చేసింది.

వాట్సాప్ వెరిఫికేషన్ మార్క్ ఇక నీలి రంగులో!

న్యూఢిల్లీ: ఆండ్రాయిడ్‌లో వాట్సాప్ చానల్ వెరిఫికేషన్ చెక్ మార్క్ త్వరలోనే నీలి రంగులో కనిపించబోతున్నది. ప్రస్తుతం ఇది ఆకుపచ్చ రంగులో కనిపిస్తున్నదనే సంగతి తెలిసిందే. అయితే వాట్సాప్ బీటా వెర్షన్‌లో ఈ మార్క్ నీలి రంగులో ఉన్నట్లు డబ్ల్యూఏబీటాఇన్ఫో అనే ఫీచర్ ట్రాకర్ గుర్తించింది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో మాదిరిగానే వాట్సాప్ మార్క్ కనిపించేలా మార్పులు చేయాలని వాట్సాప్ నిర్ణయించినట్లు తెలుస్తున్నది. త్వరలోనే ఐఓఎస్, డెస్క్‌టాప్‌ల టెస్టర్స్‌కు దీనిని రోల్ అవుట్ చేయనున్నట్లు సమాచారం.

జపాన్‌లో 'ఒంటరి పెండ్లి' ట్రెండింగ్

సోలో హనీమూన్‌కూ వెళుతున్న యువతులు

టోక్యో: జపాన్‌లో 'ఒంటరి పెండ్లి' కొత్త ట్రెండ్‌గా మారింది. యువతులు తమను తామే మనువాడుతున్నారు. సంప్రదాయబద్ధమైన పెండ్లి తంతు వదిలివెడుతున్నారు. పెళ్లికొడుకు ఉండని ఈ కొత్త పెండ్లి ట్రెండ్‌లో వివాహ తంతును అన్ని రకాల హంగు, ఆర్భాటాలతో నిర్వహిస్తున్నారు. కొందరు యువతులు తమ జీవితంలో చాలా ముఖ్యమైన కార్యక్రమంగా దీనిని చేసుకుంటున్నారు. మరికొందరు సొగసైన తెల్లని గౌనును ధరిస్తున్నారు. ఈ ట్రెండ్‌కు ఆద్యురాలు అడల్ట్ వీడియో స్టార్ మన సకుర. ఆమె 2019 మార్చిలో తనను తానే పెళ్లి చేసుకుంది. ''నేను నా సొంత జీవితాన్ని గౌరవిస్తాను. ఆరోగ్యంగా ఉన్నా, రోగగ్రస్థురాలినైనా, నన్ను నేను ఎల్లవేళలా ప్రేమించుకుంటాను, నన్ను నేను సంతోషపరచుకుంటాను'' అని ప్రతిజ్ఞ చేసింది. హనవోకా అనే యువతి కూడా ఏకాకి పెళ్లి చేసుకుంది. ''నన్ను నేను పెళ్లి చేసుకోవడమంటే, పురుషుడిని పెళ్లి చేసుకోవాలని కోరుకోవడం లేదని కాదు'' అని ఆమె చెప్పింది. వివాహిత మహిళలు కూడా ఒంటరి పెళ్లిళ్లు చేసుకోవడం విశేషం. మరోవైపు సంప్రదాయబద్ధమైన పెళ్లిళ్లు తగ్గిపోయినట్లు జపాన్ ప్రభుత్వ గణాంకాలు చెప్తున్నాయి. అయితే సోలో వెడ్డింగ్స్ పెరగడం వల్ల ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్నదని తెలుస్తున్నది. ఏకాకి పెళ్లి చేసుకునేవారు సోలో హనీమూన్‌కు కూడా వెళ్తున్నారు!

కరువు, అప్పులే ఉరి తాళ్లు

కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో రైతులకు కష్ట కాలం

15 నెలల కాలంలో 1,182 మంది ఆత్మహత్య

ఆత్మహత్యలే లేవని గతంలో డిప్యూటీ సీఎం వ్యాఖ్య

వాస్తవాలను వెల్లడించిన రెవెన్యూ శాఖ నివేదిక

బెంగళూరు, జూలై 8: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. తీవ్ర కరువు, అప్పుల భారం, పంట నష్టం వంటి కారణాల వల్ల రైతన్నలు ప్రాణాలు తీసుకుంటున్నారు. వ్యవసాయం చేయలేక, అప్పులు తీర్చలేక అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఆత్మహత్యలను తేలిగ్గా తీసుకుంటున్నదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. అన్నదాతల ఆత్మహత్యలపై కాంగ్రెస్ మంత్రులు ఒక్కొక్కరు ఒక్కో తీరున మాట్లాడుతున్నారని ఆరోపిస్తున్నాయి. నష్ట పరిహారం కోసమే ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఒక మంత్రి అంటే, అసలు రైతు ఆత్మహత్యలే జరగడం లేదని మరో మంత్రి ఇటీవల వ్యాఖ్యానించడం పట్ల దుమ్మెత్తిపోస్తున్నాయి. ఈ నేపథ్యంలో అసలు విషయం తాజాగా రెవెన్యూ శాఖకు చెందిన ఒక దస్త్రంలో బయటకు వచ్చింది. గత 15 నెలల కాలంలో రాష్ట్రంలో 1,182 మంది రైతులు ఆత్మహత్య చేసుకొన్నారని ఈ నివేదిక స్పష్టం చేస్తున్నది.

ఒక్క జిల్లాలోనే 122 మంది

రాష్ట్రంలో ఎక్కువ రైతు ఆత్మహత్యలకు తీవ్ర కరువు పరిస్థితులు, పంట నష్టం, అప్పుల భారమే కారణమని రెవెన్యూ శాఖ నివేదిక స్పష్టం చేస్తున్నది. ఎక్కువగా బెళగావి జిల్లాలో 122 మంది, హవేరిలో 120 మంది, ధార్వాడ్‌లో 101 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. చిక్‌మగళూరులో 89 మంది, కలబుర్గిలో 69 మంది, యాదగిరిలో 68 మంది రైతులు బలవంతంగా తనువు చాలించారు. 27 జిల్లాలతో కూడిన కర్ణాటకలో కేవలం ఆరు జిల్లాల్లో మాత్రమే 10 మంది లోపు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. మిగతా 21 జిల్లాల్లో 30 మందికి పైగా రైతన్నలు ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

పరిహారం పెంచాకే ఆత్మహత్యలు పెరిగాయి: మంత్రి పాటిల్

రైతుల ఆత్మహత్యల అంశాన్ని రైతు సంఘాలు, విపక్ష పార్టీలు లేవనెత్తుతున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా ఆత్మహత్యలపై మంత్రుల స్పందన తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. గత సెప్టెంబరులో చెరుకు అభివృద్ధి, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీల మంత్రి శివానంద్ పాటిల్ రైతుల ఆత్మహత్యలపై మాట్లాడుతూ... ప్రభుత్వం ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ఇచ్చే నష్టపరిహారాన్ని పెంచిన తర్వాత రైతుల ఆత్మహత్యలు పెరిగాయని పేర్కొనడం వివాదాస్పదమైంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. 'ఆత్మహత్యలు ఎక్కడ జరుగుతున్నాయో చెప్పండి. సొంత కారణాల వల్ల ఆత్మహత్యలు చేసుకున్న వారిని రైతులు అంటామా?' అంటూ ఆయన వ్యాఖ్యానించడం పట్ల విమర్శలు వచ్చాయి. ఇప్పుడు రెవెన్యూ శాఖ దస్త్రం ప్రకారమే 15 నెలల్లో 1,182 మంది రైతులు ఆత్మహత్య చేసుకొన్నారని తేలడంతో రాష్ట్రంలో రైతుల దయనీయ స్థితి స్పష్టమవుతున్నదని విపక్షాలు పేర్కొంటున్నాయి.

మందు పార్టీతో ఓటర్లకు 'కృతజ్ఞతలు'

కర్ణాటక బీజేపీ ఎంపీ దావత్‌లో మనిషికో సీసా పంపిణీ

న్యూఢిల్లీ, జూలై 8: లోక్‌సభ ఎన్నికల్లో చిక్కబళ్లాపూర్ ఎంపీగా బీజేపీ నేత కే సుధాకర్ విజయం సాధించినందుకు కృతజ్ఞతగా ఆయన అభిమానులు సోమవారం పెద్దయెత్తున 'మందు పార్టీ' ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వందలాది మందికి మద్యం సీసాలు, ఆహారాన్ని సరఫరా చేశారు. దీనిపై కాంగ్రెస్ నేత, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందిస్తూ.. 'ఇదీ బీజేపీ సంస్కృతి' అని వ్యాఖ్యానించారు. దీనిని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే ఈ కార్యక్రమానికి అనుమతి కోసం పోలీసులకు స్వయంగా లేఖ రాసిన ఎంపీ సుధాకర్ ఆ తర్వాత ఈ కార్యక్రమం గురించి తనకు తెలియదని ప్రకటించారు. పోలీసులు సైతం ఈ కార్యక్రమానికి అనుమతి ఇచ్చి, పెద్దయెత్తున బందోబస్తు ఏర్పాటు చేయడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

జబ్బులు ప్రబలుతుంటే 'ఈత' కొడతారా?

కర్ణాటక ఆరోగ్య మంత్రిపై బీజేపీ విమర్శలు

బెంగళూరు, జూలై 8: కర్ణాటక వైద్యారోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు ఓ స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతున్న వీడియోపై బీజేపీ విమర్శలు చేసింది. 'నగరాల్లోని నీటి కుంటలు అపరిశుభ్రతతో నిండిపోయి డెంగీ, మలేరియా వంటి జబ్బులు ప్రబలుతుంటే పేదల పక్షపాత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం స్వచ్ఛమైన ఈత కొలనులో తేలియాడుతున్నది' అని విమర్శిస్తూ బీజేపీ 'ఎక్స్'లో పేర్కొన్నది. మంత్రి దినేశ్ గుండూరావును రోమన్ చక్రవర్తి నీరోతో పోలుస్తూ 'నీరో రావు' అని విమర్శించింది. దీంతో బీజేపీ విమర్శలకు మంత్రి కౌంటర్ ఇచ్చారు. స్విమ్మింగ్ తనకు వ్యాయామమని పేర్కొంటూ బీజేపీ నేతలను కూడా ఈత కొట్టమని సూచించారు.'ఈత వల్ల ఆరోగ్యంగా ఉండటంతో పాటు మెదడు కూడా చురుగ్గా పని చేస్తుంది. అబద్ధాలను ఆశ్రయించడం, దృష్టి మళ్లించే వ్యూహాలు సృష్టించడమే కాకుండా వేరే విషయాలపై దృష్టి పెట్టడానికి మీకు ఉపయోగపడుతుంది' అంటూ బీజేపీ నేతలను ఉద్దేశించి పేర్కొన్నారు.

సారేన్‌కు బెయిల్‌పై సుప్రీంకోర్టుకు ఈడీ

న్యూఢిల్లీ, జూలై 8: మనీలాండరింగ్ కేసులో జార్ఖండ్ సీఎం హేమంత్ సారేన్‌కు రాష్ట్ర హైకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని సవాల్ చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సారేన్‌కు వ్యతిరేకంగా ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవని చెప్పడంలో జార్ఖండ్ హైకోర్టు పొరపాటు పడిందని తెలిపింది. గత నెల 28న బెయిల్‌పై వచ్చిన సారేన్ సీఎంగా తిరిగి ప్రమాణం చేశారు.

నెలసరి సెలవులపై ప్రభుత్వాలదే నిర్ణయం

పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జూలై 8: ఉద్యోగినులు, విద్యార్థినులకు నెలసరి సెలవులు తప్పనిసరి చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. విధాన పరమైన నిర్ణయాల్లో తాము జోక్యం చేసుకోలేమని వ్యాఖ్యానించింది. సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. నెలసరి సెలవులు మంచి నిర్ణయమే అయినప్పటికీ.. దీనివల్ల మహిళలకు ఉద్యోగ అవకాశాలను దూరమయ్యే అవకాశముందని అభిప్రాయపడింది. ఏదేమైనప్పటికీ.. ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించి, ఒక మోడల్ పాలసీని తీసుకురావాలని సూచించింది.

ఈడ్చుకెళ్లి పడేసి.. కొడుకును తప్పించి

బీఎండబ్ల్యూ కేసులో శివసేన నేతకు 14 రోజుల రిమాండ్

ముంబై, జూలై 8: ముంబైలో శివసేన నేత రాజేశ్ షా కుమారుడు మిహిర్ షా చేసిన కారు ప్రమాదంలో అసలు వాస్తవం బయటకు వచ్చింది. ప్రమాదం తర్వాత మిహిర్ ఫోన్‌లో తన తండ్రికి విషయం చెప్పడంతో ఆయన వెంటనే ఘటనా స్థలికి చేరుకొని కొడుకుని అక్కడ నుంచి పంపించి వేశాడు. ఇంతలో అక్కడకు చేరుకున్న పోలీసులు రాజేష్, డ్రైవర్ బిదావత్‌ను అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మిహిర్ తొలుత మహిళను ఢీకొన్న తర్వాత ఆమెను 1.5 కిలోమీటర్లు ఈడ్చుకు వెళ్లాడు. తర్వాత వాహనం టైరులో చిక్కుకున్న ఆమెను రోడ్డుపై పడేశాడు. తర్వాత బిదావత్ కారు నడిపాడు. కారును రివర్స్ చేసేటప్పుడు ఆమెపై నుంచి మరోసారి కారును ఎక్కించాడు. మరోవైపు ఈ కేసులో రాజేష్ షాకు ముంబై కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. మిహిర్ షా (24) పరారీలో ఉన్నాడు. బిదావత్‌ను మంగళవారం వరకు పోలీస్ కస్టడీకి పంపుతూ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారు.

ఉత్తరాదిలో వర్ష బీభత్సం

- ముంబై ఎయిర్‌పోర్టులో 50 విమాన సర్వీసులు రద్దు
- రాయ్‌గఢ్ కోటలో వరదలు.. చిక్కుకున్న పర్యాటకులు
- కజిరంగా నేషనల్ పార్క్‌లో 131 జంతువుల మృత్యువాత

రాయ్‌గఢ్ కోటలో సంభవించిన వరదల్లో చిక్కుకుపోయిన పర్యాటకులు

న్యూఢిల్లీ: కొద్ది రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలు ఉత్తర భారతదేశంలో జన జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. హిమాచల్ ప్రదేశ్, యూపీ, బీహార్, అస్సాం, మహారాష్ట్ర, జమ్ము కశ్మీర్, ఉత్తరాఖండ్ ప్రజలు ప్రయాణాలు, తాగునీరు వంటి అత్యవసరాల కోసం సైతం ఇబ్బందులు పడుతున్నారు. వైమానిక, రైల్వే, రోడ్డు రవాణాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. కొండ చరియలు విరిగిపడుతుండటంతో సమీపంలోని ప్రజలు బిక్కుబిక్కుమని కాలం గడుపుతున్నారు. కొండ చరియలు విరగడంతో హిమాచల్ ప్రదేశ్‌లో అధికారులు సోమవారం ఓ జాతీయ రహదారితోపాటు 70కిపైగా రోడ్లను మూసివేశారు. అస్సాంలో భారీ వర్షాల వల్ల కజిరంగా నేషనల్ పార్క్‌లోని 131 జంతువులు మృతి చెందగా, 96 జంతువులను కాపాడినట్లు అధికారులు తెలిపారు. జమ్ము కశ్మీరులోని పూంఛ్ జిల్లాలో మొఘల్ రోడ్డుపై భారీ కొండ చరియ విరగడంతో పూంఛ్, రాజౌరీ జిల్లాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముంబైలో భారీ వర్షాల కారణంగా విమానాశ్రయంలో రన్‌వే ఆపరేషన్స్ దాదాపు గంటకుపైగా నిలిచిపోయాయి. 50 విమానాలను రద్దు చేశారు. ప్రముఖ పర్యాటక ప్రదేశం రాయ్‌గఢ్ కోటలో ఆదివారం పర్యాటకులు నానా అవస్థలు పడ్డారు. సుమారు 30 మంది పర్యాటకులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. రైల్వే ట్రాక్‌లపై భారీగా నీరు చేరడంతో పశ్చిమ, మధ్య రీజియన్ రైల్వే అధికారులు చాలా రైళ్లను రీ షెడ్యూల్ చేశారు.

భారతీయులకు తగ్గిన ఈబీ-5 వీసాల జారీ

ఎనిమిది నెలల్లో 22 శాతం తగ్గుదల

ముంబై, జూలై 8: అమెరికాలో పెట్టుబడులు పెట్టేవారికి ఇచ్చే ఈబీ-5 వీసాలు పొందుతున్న భారతీయుల సంఖ్య గత ఎనిమిది నెలలుగా తగ్గుతున్నది. 2024 ఆర్థిక సంవత్సరం మొత్తంగా చూసుకుంటే ఈబీ-5 వీసాలు పొందిన భారతీయుల సంఖ్య ముందు ఏడాది కంటే పెరిగినప్పటికీ, గత ఏడాది అక్టోబరు నుంచి ఈ ఏడాది మే వరకు మాత్రం 22 శాతం మేరకు తగ్గిపోయింది. ఈ ఎనిమిది నెలల కాలంలో కేవలం 512 మంది భారతీయులకు మాత్రమే ఈబీ-5 వీసాలు జారీ అయ్యాయి. అమెరికాలో ఎనిమిది లక్షల డాలర్లు(దాదాపు రూ.6.67 కోట్లు) పెట్టుబడి పెట్టి, కనీసం 10 మంది అమెరికన్లకు ఉపాధి కల్పించే వారికి ఈబీ-5 వీసా జారీ చేస్తారు. ఈ వీసా లభించిన వారికి అమెరికాలో శాశ్వత నివాసం కోసం త్వరగా గ్రీన్ కార్డు వస్తుంది. ఎనిమిది నెలలుగా ఈబీ-5 వీసా పొందుతున్న భారతీయుల సంఖ్య తగ్గినప్పటికీ మిగతా దేశాలతో పోల్చితే భారతీయులే ఎక్కువగా ఈ వీసాలు పొందుతున్నారు.

ఆర్మీ కాన్వాయ్‌పై భారీ ఉగ్ర దాడి

- ఐదుగురు జవాన్లు కన్నుమూత

ఉగ్రదాడిలో గాయపడ్డ జవాన్‌ను దవాఖానకు తరలిస్తున్న సిబ్బంది

శ్రీనగర్, జూలై 8: జమ్ముకశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో భారత సైనికులు జరిపిన ఎన్‌కౌంటర్లపై ఉగ్రవాదులు ప్రతీకార దాడికి పూనుకున్నారు. సోమవారం భారత ఆర్మీ కాన్వాయ్‌పై ఉగ్రవాదులు దాడి చేయడంతో ఐదుగురు జవాన్లు మృతి చెందగా, ఆరుగురు గాయపడ్డారు. కథువా జిల్లాలోని మాచేడి ప్రాంతంలో ఉగ్రవాదులు కొండపై నుంచి గ్రనేడ్లు, ఇతర మారణాయుధాలతో ఈ దాడి చేశారు. వెంటనే తేరుకున్న సైనికులు ఎదురు కాల్పులు జరుపగా, ఉగ్రవాదులు పారిపోయారు. వారి కోసం గాలింపు జరుగుతున్నది. మరోవైపు రాజౌరీ వద్ద మారుకోట్ సైనిక శిబిరంపై ఆదివారం తెల్లవారుజామున ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఒక జవాన్‌కు గాయాలయ్యాయి. దీంతో అప్రమత్తమైన ఆర్మీ ఎదురుకాల్పులకు దిగడంతో ఉగ్రవాదులు పరారయ్యారు.

కప్ బోర్డులో బంకర్లు

కుల్గాం జిల్లాలో శనివారం ఎన్‌కౌంటర్ సందర్భంగా ఉగ్రవాదులకు సంబంధించిన కొత్త విషయం బయటపడింది. చిన్నిగామ్ ఫీసల్ అనే గ్రామంలో జనావాసాల మధ్య ఇంటి కప్‌బోర్డులో ఉగ్రవాదులు నిర్మించుకున్న బంకర్ చూసి ఆర్మీ ఆశ్చర్యపోయింది. కప్‌బోర్డు ద్వారా లోపలికి దూరి వెళ్లే విధంగా నిర్మించిన ఈ బంకర్ పూర్తి కాంక్రీట్‌తో నిర్మించి ఉంది. కొన్నేండ్ల క్రితం ఉగ్రవాదులు సెప్టిక్ ట్యాంక్ కింద ఇలాగే బంకర్ ఏర్పాటు చేసుకోగా, దానిని సైనికులు కనిపెట్టి ధ్వంసం చేశారు. ఇప్పుడు ఉగ్రవాదులు కిచెన్లు, అల్మారాలు, డ్రాయింగ్ రూమ్‌ల వెనుక బంకర్లు ఏర్పాటు చేసుకుంటున్నట్టు ఆర్మీ గుర్తించింది.

ఒకే రోజు రెండుసార్లు 'మంత్రి'గా ప్రమాణం

మధ్యప్రదేశ్‌లో అసాధారణ ఘటన

రామ్ నివాస్

భోపాల్, జూలై 8: మధ్యప్రదేశ్ అసెంబ్లీలో సోమవారం ఒక అసాధారణ ఘటన చోటుచేసుకుంది. బీజేపీ నేత రామ్‌నివాస్ రావత్ ఒకే రోజు కేవలం 15 నిముషాల వ్యవధిలో రెండుసార్లు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవలే కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన రావత్‌ను మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ తన క్యాబినెట్‌లోకి తీసుకున్నారు. దీనితో ఆయన సోమవారం రాజ్‌భవన్‌లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన తన ప్రమాణంలో రాజ్య కే మంత్రి (రాష్ట్ర మంత్రి)కి బదులుగా రాజ్య మంత్రి (సహాయ మంత్రి) అని ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో నేతలు, మీడియాలో గందరగోళం ఏర్పడటంతో జరిగిన పొరపాటును గ్రహించారు. దీంతో కొద్ది నిముషాల అనంతరం గవర్నర్ రెండోసారి ఆయనతో రాజ్య కే మంత్రి అంటూ ప్రమాణం చేయించారు. తాను మంత్రిగా రెండుసార్లు ప్రమాణ స్వీకారం చేసినట్టు రావత్ మీడియాతో సరదాగా వ్యాఖ్యానించారు. విజయ్‌పూరి నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా నెగ్గిన రావత్ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఏప్రిల్ 30న బీజేపీలో చేరి ఆ పార్టీకి ప్రచారం చేశారు. అయితే ఆయన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకపోవడం పట్ల ఆ పార్టీ మండిపడింది.

ఫ్రాన్స్ ఎన్నికల్లో ఎటూ తేలని తీర్పు

పారిస్: ఫ్రాన్స్‌లో జరిగిన ఆకస్మిక ఎన్నికల్లో ఓటర్ల తీర్పు స్పష్టంగా లేదు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో లెఫ్ట్, సెంటర్, ఫార్ రైట్ పార్టీల్లో దేనికీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి తగినంత సంఖ్యాబలం రాలేదు. దీంతో ప్రధాన మంత్రి గాబ్రియేల్ అట్టల్ రాజీనామా చేశారు. అయితే ఆయన రాజీనామాను దేశాధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మెక్రాన్ సోమవారం తిరస్కరించారు. దేశ సుస్థిరత కోసం తాత్కాలికంగా ప్రభుత్వాధినేతగా కొనసాగాలని అట్టల్‌ను కోరారు.

ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు

20 మంది మృతి

కీవ్: రాజధాని కీవ్ సహా ఉక్రెయిన్ నగరాలపై సోమవారం రష్యా భీకర క్షిపణి దాడులకు దిగింది. ఈ దాడుల్లో కనీసం 20 మంది చనిపోయారని, 50 మందికి పైగా గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు మీడియాకు వెల్లడించారు. రాజధాని కీవ్‌లోని అతిపెద్ద పిల్లల దవాఖాన పైనా రష్యా క్షిపణి దాడులు జరిపింది. ఈ ఘటనలో పిల్లలు, వైద్య సిబ్బంది శిథిలాల కింద చిక్కుకుపోయారని, అక్కడ సహాయ ఆపరేషన్ చేపట్టామని అధ్యక్షుడు జెలెన్‌స్కీ 'ఎక్స్'లో తెలిపారు. ఈ దాడులపై ప్రపంచ దేశాలు మౌనం వహించరాదని ఆయన కోరారు.

అధ్యక్ష పోటీ నుంచి తప్పకోను

తనపై వ్యతిరేక ప్రచారాన్ని ఆపాలని బైడెన్ విజ్ఞప్తి

వాషింగ్టన్